
సాక్షి
పల్నాడు

గురువారం । 6 । మార్చి । 2025



పోలీసుల స్వచ్ఛ భారత్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోలీసులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 526.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు



పిడుగురాళ్ల: నాగుల గుడిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
నరసరావుపేట	6.23	5.07
గుంటూరు	6.21	5.05
బాపట్ల	6.21	5.05

న్యూస్‌రీల్

గుడారాల పండగ ఏర్పాట్ల పరిశీలన



అమరావతి : గుడారాల పండగ ఏర్పాట్లను బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఆయన హోసన్నా దయాక్షేత్రం ప్రాంగణంలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నియంత్రణ, కంట్రోల్ రూం వంటి అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, నిర్వాహకులు అబ్రహం, జాన్‌వెస్లీ, అనీల్, సీఐ అచ్చియ్య పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయిస్తున్నట్లు ఎక్సైజ్ ఈ.ఎస్ మణికంఠ బుధవారం తెలిపారు. జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 13 మద్యం దుకాణాలకు 199 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు. దరఖాస్తు దారులంతా హాజరై లాటరీలో మద్యం దుకాణం దక్కించుకొన్న వారు ప్రభుత్వం నిర్ధారించిన సొమ్ము చెల్లించాలన్నారు.

ప్రపంచబ్యాంక్ బృందం పర్యటన



తాడికొండ: రాజధాని అమరావతిలో నిపుణులతో కూడిన ప్రపంచ బ్యాంక్ బృందం బుధవారం పర్యటించింది. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రపంచ బ్యాంక్ బృందం నిర్దేశించిన కార్యక్రమాల అమలు, వాటి నిర్వహణ రూపకల్పనపై చర్చ జరిపింది. నీటి నిర్వహణ ప్రాజెక్టులు, పర్యావరణ, సామాజిక రక్షణకు రూపొందించిన కార్యకలాపాలు, ప్రొక్యూర్‌మెంట్ విషయాలపై ఏపీ సీఆర్డీయే అధికారులతో బృంద సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంక్ కో టాస్క్ టీం లీడర్ గెరాల్డ్ ఒలీవర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ ప్యాట్రన్ సభ్యత్వం



బాపట్ల : ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ప్యాట్రన్ సభ్యత్వం 24 మందికి ఇవ్వటం ఎంతో సంతోషకరమని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈ మేరకు రూ.6.02 లక్షల చెక్కును రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నారాయణభట్టుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గ్లోరియా, రెడ్‌క్రాస్ బృందం సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలని సూచించారు.

పోలీసుల నుంచి తప్పించుకోబోయి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: పోలీసుల బారి నుంచి తప్పించుకునేందుకు లాడ్జి పైనుంచి దూకి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం తుకారాంగేట్‌కు చెందిన రాములు నాయక్ గుంటూరు పరిసరాల్లో జరిగిన చోరీల్లో అనుమానితుడిగా భావిస్తున్నారు. నరసరావుపేట కోర్టుకు వాయిదాకి వచ్చినట్లు తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని లాడ్జికి వెళ్లాడు. గుంటూరు నుంచి వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాత్రూంకు వెళ్లి వస్తానని చెప్పి కిటికీలో నుంచి కిందకు దిగే ప్రయత్నం చేశాడు. ప్రమాదవశాత్తు జారి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అక్రమంగా చేపట్టే..!

- వేలం లేకుండానే చేపల చెరువును స్వాధీనం చేసుకున్న వైనం
- మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 200 ఎకరాల చెరువు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు

నరసరావుపేట మండలం కాకానిలో టీడీపీ నేతల చేపల సాగు



నరసరావుపేట మండలం కాకాని చెరువు



సాక్షి, నరసరావుపేట: అధికార బలం, ప్రభుత్వ అధికారుల సహకారంతో కూటమి నేతలు అక్రమార్జనకు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా వేలం పాట లేకుండా 200 ఎకరాల చేపల చెరువును అక్రమంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. చేపల సాగు మొదలుపెట్టారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండిపడింది. నరసరావుపేట మండలం కాకానిలో 294 ఎకరాల్లో చేపల చెరువు ఉంది. ఇందులో 90 ఎకరాలకుపైగా ఇప్పటికే ఆక్రమణకు గురైంది. మిగిలిన 200 ఎకరాలను మైనర్ ఇరిగేషన్ శాఖ నిర్వహిస్తోంది. ఏటా చెరువుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తారు. వేలంలో అత్యధిక ధరకు పాడిన వారికి ఏడాదిపాటు చేపలు పెంపకానికి అనుమతిస్తారు. సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు కావడంతో వేలంలో పెద్ద మొత్తంలో ధర పలుకుతుంది.

పట్టించుకోని అధికారులు

ఎనిమిది నెలలుగా చెరువులో చేపలు సాగవుతున్నా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు చెరువుకు అధికారులు వేలం నిర్వహించకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఈ చెరువుకు ఇప్పుడు వేలం నిర్వహిస్తే ప్రభుత్వానికి సుమారు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ ఆదాయాన్ని పంచాయతీ, నీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్ శాఖకు కేటాయిస్తారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా చేపల సాగు చేస్తున్న అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

త్వరలో వేలంపాట

కాకాని చేపల చెరువుకు ఇప్పటివరకు వేలం పాట నిర్వహించలేదు. కలెక్టర్ అనుమతితో త్వరలో చెరువు వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎవరైనా చెరువులో చేపల సాగు చేస్తూ ఉంటే అది అక్రమంగా చేస్తున్నదే.

– మాధవీలత, నరసరావుపేట ఆర్డీఓ

టీడీపీ నాయకుల ఆక్రమణలో..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన వేలంలో దాదాపు రూ.12 లక్షలకు చెరువును వ్యాపారులు దక్కించుకున్నారు. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో వేలం పాటలు నామమాత్రంగా జరిగాయి. కనీస ధరకే టీడీపీ నాయకులు పాటను దక్కించుకొని చెరువులో చేపల పెంపకాన్ని చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కరోనా వల్ల రెండేళ్ల వేలం పాట నిలిచిపోయింది. ఆ తరువాత కూడా వ్యాపారులు ముందుకు రాకపోవడంతో తక్కువ ధరలకే వేలం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేలం పాటలను నిర్వహించలేదు. చెరువును గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆక్రమించి జూలైలో చేప పిల్లలను వదిలి సాగును ప్రారంభించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో శ్రద్ధ అవసరం

కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ కనబరచాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం ఎండార్స్‌మెంట్ ఫిర్యాదుల విషయంలో అధికారులు విచారణ చేసి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఫిర్యాదులు రీ ఓపెన్ కాకూడదని స్పష్టం చేశారు. అన్ని ఫిర్యాదులపై నాలుగుస్థాయిల్లో ఆడిట్ జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిన ఇంకొల్లుకు చెందిన గంటా సుబ్బారావుతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారు చెప్పిన అంశాలపై దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్షించి రికార్డులు వెరిఫికేషన్ కోసం 10వ తేదీ వరకు సమయం ఇచ్చారు. అచ్చంపేట మండలం నిడుజెర్ల గ్రామానికి చెందిన పి.నాగరత్నమ్మతో కూడా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుపై చర్చించారు. పోలీసులకు సూచనలు చేశారు.



కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పీ–4 సర్వేకు సహకరించండి

జిల్లాలో చేపట్టే పీ–4 సర్వేకు అందరూ సహకరించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సర్వే సూపర్‌వైజర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈనెల 8 నుంచి 18 వరకు పీ–4 సర్వే జరుగుతుందని పేర్కొన్నారు.

కూలీల ట్రాక్టర్‌ను ఢీకొన్న ఇసుక టిప్పర్

తొమ్మిది మందికి గాయాలు

కారెంపూడి: పొలం పనులకు వెళ్తున్న కూలీల ట్రాక్టర్‌ను టిప్పర్ ఢీకొనడంతో 9 మంది గాయపడిన ఘటన మండలంలోని నరమాలపాడు గ్రామం వద్ద బుధవారం జరిగింది. మండలంలోని మిరియాల గ్రామం నుంచి మిరపకాయలు కోసేందుకు నరమాలపాడు గ్రామానికి కూలీలు ట్రాక్టర్‌లో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నరమాలపాడు గ్రామ ఎస్సీ కాలనీ వద్ద ట్రాక్టర్‌కు అడ్డుగా కోళ్లు రావడంతో డ్రైవర్ స్లో చేశాడని తెలుస్తోంది. ఇదే సమయంలో వెనుకగా అమరావతి నుంచి ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ అదుపుతప్పి ట్రాక్టర్ ట్రక్కును వెనుకగా ఢీకొంది. దీంతో ట్రక్కులో ఉన్న వారిలో 9 మందికి గాయాలయ్యాయి. వద్దెబోయిన లక్ష్మయ్య, ఆయన భార్య నాగలక్ష్మి, గండికోట ఆవులయ్య, కఠారి సంధ్య, బైనబోయిన వెంకటేశ్వర్లు, పేరుబోయిన అంకమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మారుబోయిన పార్వతి, మారుబోయిన నర్సయ్య, సకినాల సైదులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో కొందరిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు, మరికొందరిని నర్సరావుపేట ఏరియా ఆస్పత్రికి 108 అంబులెన్సులలో తరలించారు. టిప్పర్ ఢీకొనే సమయంలో ట్రక్కు వెనుక కూర్చున్న వారు కాళ్లు తక్షణమే పైకిపెట్టుకోవడంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ వాసు పరిశీలించారు. ఎస్ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రురాలికి సపర్యలు చేస్తున్న తోటి కూలీలు

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, వైఎస్సార్ సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి నేతలు దమనకాండ కొనసాగిస్తున్నారని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. పోలీసులు, టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎస్‌కే రఫీని బుధవారం ఆయన పరామర్శించారు. పట్టణంలోని చిన్నపరెడ్డి ఆసుపత్రి వద్దకు వెళ్లి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఎస్‌కే రఫీతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామంలో కేవలం రెండు, మూడు కుటుంబాలు ఉన్న ముస్లిం మైనార్టీ వర్గాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోలీసులు జోక్యం చేసుకొని ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రఫీని బెదిరించినట్లు చెప్పారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. రఫీ కుటుంబసభ్యులకు అండగా ఉంటామని, న్యాయపరమైన పోరాటానికి కూడా సిద్ధమని ప్రకటించారు. చేతనైతే మంచి పరిపాలన అందించాలని, ఇలా కక్షసాధింపు రాజకీయాలు మానుకోవాలని అన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే పోలీసులే ఈ విధంగా భయపెట్టి దారుణంగా కొట్టి హింసించి స్థానిక టీడీపీ నాయకుల కాళ్లు పట్టుకొని క్షమాపణ అడిగితేనే కేసులు లేకుండా చేస్తామని అనడం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో కార్యకర్తల కోసం ఎందాకైనా పోరాడుతానని అన్నారు.



రఫీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

కోటప్పకొండ ఆలయ భూముల రికార్డులు ట్యాంపరింగ్

- ఈనాం భూములు ప్రైవేటువిగా మార్పు
- అక్రమ తవ్వకాల వ్యవహారంతో వెలుగులోకి
- భూములను పరిశీలించిన ఈఓ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయ భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు అధికారులు గుర్తించారు. ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలపై 'దేవాంతకులు' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొండకావూరు పరిధిలో నాయీబ్రాహ్మణులకు కేటాయించిన భూములను బుధవారం కోటప్పకొండ ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు పరిశీలించారు. అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు జరిపిన భూమి ఆలయానికి చెందిందిగా నిర్ధారించారు. భూముల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపినట్టు గుర్తించారు. ఆరున్నర ఎకరాలలో దాదాపు రెండు ఎకరాల్లో అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు జరిపి ఉంటారని భావిస్తున్నారు. అనంతరం రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలించారు. నాయీబ్రాహ్మణులకు కేటాయించిన భూములు రెవెన్యూ రికార్డుల్లో ప్రైవేటు భూములుగా కనిపించాయి. గతంలోనే రెవెన్యూ రికార్డుల్లో ఆలయ భూముల ట్యాంపరింగ్ జరిగిందని భావిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపేందుకు ఆలయ అధికారులు సిద్ధమవుతున్నారు. భూముల్లో అక్రమ తవ్వకాలు జరిపిన వారిపైనా చర్యలకు సమాయత్తమవుతున్నారు. పూర్తి వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

ఐపీ పెట్టిన ధాన్యం వ్యాపారి!

రైతులకు రూ.2 కోట్ల పైచిలుకు టోపీ

నరసరావుపేట టౌన్: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ఓ వ్యాపారి రాత్రికిరాత్రే కోట్ల రూపాయలకు ఐపీ పెట్టిన వైనం పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు పాతూరులో స్థిరపడ్డాడు. మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో దుకాణం అద్దెకు తీసుకుని గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకంగా ధాన్యం, మొక్కజొన్న వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి వాటిని విక్రయించి ఆ తరువాత డబ్బులు ఇస్తుండేవాడు. ఈ క్రమంలోనే నాలుగు నెలలుగా రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న లారీలకు లోడ్‌లు ఎత్తుకున్నాడు. నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదు. ఈ మధ్య కాలంలో రైతులు అతని దుకాణం వద్దకు వచ్చి డబ్బుల కోసం నిలదీశారు. దీంతో 20 రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన శ్రీనివాసరావు ఐపీ నోటీసులు పంపించాడు. సుమారు 80 మంది రైతులకు రూ.2 కోట్ల పైచిలుకు బాకీ ఉన్నట్లు సమాచారం. ధాన్యం వ్యాపారి ఐపీ పెట్టడం రైతులను, వ్యాపారులను కలవరపాటుకు గురిచేసింది.

మహిమాన్వితం..సాగర్‌మాత క్షేత్రం

రేపటి నుంచి 9వ తేదీ వరకు సాగర్‌మాత మహోత్సవాలు

విజయపురిసౌత్: ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతున్న సాగర్‌మాత మహోత్సవాలను ఈ నెల 7, 8, 9 తేదీలలో ఘనంగా జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయపురి సౌత్‌లో కృష్ణానది ఒడ్డున నెలవైన ప్రముఖ పుణ్యక్షేత్రం సాగర్‌మాత దేవాలయానికి రాష్ట్రంలోనే విశిష్టత కలిగిన దేవాలయంగా పేరుంది. భక్తులు కోర్కెలు తీర్చే తల్లి సాగర్‌మాత ఆలయానికి నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఈ మందిరానికి 1977 అక్టోబర్ 10వ తేదిన అప్పటి గుంటూరు మండల పీఠాధిపతి కాగితపు మరియదాసు ప్రారంభోత్సవం చేశారు. ఉత్సవాల నేపథ్యంలో మూడు రోజులు పుణ్యక్షేత్రంలో దివ్యసత్ప్రసాదన నిత్య ఆరాధనలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయి.

కార్యక్రమాలు ఇలా..

7వ తేదీ ఉదయం 5.30గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌చే, ఇతర ఫాదర్లచే దివ్యబలిపూజ, జపమాల, స్తుతి ఆరాధన, ఇలా.. రాత్రి 9గంటల వరకు ప్రార్థనలు, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి.

- 8వ తేదీ ఉదయం 5 గంటలకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్, ఇతర ఫాదర్లచే దివ్యబలిపూజ, వాక్య పరిచర్య, రాత్రి 9గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు, ప్రత్యేక కార్యక్రమాలు.
- 9వ తేదీ రాత్రి సాగర్‌మాత రథోత్సవం ప్రధానమైంది. ఈ ఊరేగింపుతో ఉత్సవం ముగుస్తుంది. ఆ రోజు ఉదయం 5గంటలకు అత్తలూరు విచారణ గురువులు గురుశ్రీ చాట్ల కస్పార్‌చే దివ్యబలిపూజ, 6 గంటలకు కారంపూడి విచారణ గురువులు పెట్ల గురుశ్రీ మర్రి అనిల్ దివ్యబలిపూజ, 7 గంటలకు ముట్లూరు విచారణ గురువులు గురుశ్రీ మార్నేని దిలీప్‌చే దివ్యబలిపూజ, 8గంటలకు దాచేపల్లి విచారణ గురువులు గురుశ్రీ ఏరువ బాలశౌరిరెడ్డిచే దివ్యబలిపూజ, ఉదయం 10.30 గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్యచే సమష్టి దివ్యపూజ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గురువరేణ్యులు గురుశ్రీ పామిశెట్టి తోమస్ బృందంచే గానం, రాత్రి 9గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు, కార్యక్రమాలు ఉంటాయి. ఏసుప్రభు పడిన శ్రమలను స్మరించుకుంటూ మోకాళ్ల నడక ప్రార్థన చేస్తూ సాగర్‌మాతను దర్శించుకొనేందుకు ఇసుక రోడ్‌ను నిర్మించారు.



తిరునాళ్లకు ముస్తాబైన సాగర్‌మాత దేవాలయాలు

పూర్తయిన ఏర్పాట్లు..

మాచర్ల మండలం కొప్పునూరు ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో పండుగ మూడు రోజులు ప్రథమచికిత్సా శిబిరం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం మూడు రోజులు ఏర్పాటు చేస్తున్నారు. మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతి అరగంటకు విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయానికి బస్‌లు అందుబాటులో ఉంటాయి. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా ఆధ్వర్యంలో విజయపురిసౌత్ ఎస్ఐ మహమ్మద్ షఫీ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గుడి సమీపంలోని కృష్ణా జలాశయంలో స్నానం చేసే భక్తుల భద్రత కోసం గజ ఈతగాళ్లను, ప్రత్యేక బోట్‌ను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు.

అనుమతితోనే బల్లకట్లు, పడవలు నడపాలి



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో లైసెన్స్‌లు, అనుమతులు ఉన్న బల్లకట్టు, లాంచీలు, పడవలను మాత్రమే నడపాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో బల్లకట్లు, లాంచీలు, పడవలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వాటికి అనుమతులు ఉన్నదీ, లేనిదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్వో మురళి, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, అచ్చంపేట, అమరావతి, దాచేపల్లి, గురజాల, రెంటచింతల, మాచర్ల, మాచవరం తహసీల్దార్లుతోపాటు జిల్లా టూరిజం ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పందికొక్కుల దాడిలో పసికందు మృతి!

నూజెండ్ల: ఊయలలో నిద్రిస్తున్న మూడు నెలల పసికందును పందికొక్కులు కొరికి చంపిన ఘటన నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో బుధవారం జరిగింది. రవ్వారం గ్రామానికి చెందిన నాయిని కొండ గురవయ్య, దుర్గమ్మలు గ్రామాల్లో తిరిగి గాజులు అమ్ముకుని జీవనం సాగిస్తుటారు. వీరికి ఒక పాప ఉంది. సమీపంలోని ఓ తండా నుంచి మూడు నెలల బాబు కౌషిక్‌ను తెచ్చుకుని పెంచుకుంటున్నారు. ఎప్పటిలానే కొండ గురవయ్య గాజుల విక్రయానికి వెళ్లాడు. అదే సమయంలో పాప ఏడుస్తూ ఉండడంతో ఏదైనా కొని తెద్దామని తల్లి సమీపంలోని దుకాణానికి వెళ్లింది. ఈ సమయంలో ఊయలలో ఒంటరిగా ఉన్న కౌశిక్‌పై పందికొక్కులు దాడి చేశాయి. తల వెనుక భాగాన, ముఖం, కాలివేళ్లను కొరికివేశాయి. దుకాణం నుంచి వచ్చిన తల్లి పరిస్థితిని గమనించి వైద్యశాలకు తరలించేలోపు చిన్నారి మృతి చెందింది. ముక్కుపచ్చలారని చిన్నారికి జరిగిన దారుణం చూపరులను కంటతడి పెట్టించింది.



పందికొక్కుల దాడిలో మృతి చెందిన కౌషిక్



తల్లి దుర్గమ్మ ఒడిలో పసికందు మృతదేహం